సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 17 । నవంబర్ । 2022

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామివారి రిరుల ఇరుముడుల స్వీకరణ అడ్డతీగల పవనగిరి క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 8లో



కాఫీ సాగు..లాభాలు బాగు



మన్యంలో గిరిజన రైతులు ప్రధాన వాణిజ్య పంటగా కాఫీని సాగు చేస్తున్నారు. ఏజెన్సీ కాఫీకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో విస్తారంగా పండిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

నాటు తుపాకీ మిస్ ఫైర్?

- వ్యక్తికి గాయాలు
- ఎటువంటి సమాచారం లేదు: సీఐ సురేష్‌బాబు

దేవీపట్నం: మండలంలోని ఎర్రమెట్ల పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నాటు తుపాకీ మిస్ ఫైర్ అవడంతో వ్యక్తికి గాయాలైనట్లు తెలిసింది. ఈ ఘటన ఏ నేపథ్యంలో జరిగిందనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై తమకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని రంపచోడవరం సీఐ సురేష్‌బాబు తెలిపారు.

కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

- దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువు
- కొయ్యూరు సీఐ స్వామినాయుడు



మాట్లాడుతున్న స్వామినాయుడు

కొయ్యూరు: జీడీ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని కొయ్యూరు సీఐ స్వామినాయుడు తెలిపారు. బుధవారం ఆయన మంప గిరిజన సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అర్హత ఉన్న అభ్యర్థులంతా ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి వివరాలకు తమను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చిన్నప్పటినుంచి మంచి లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. తహశీల్దారు తిరుమలరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.దీనిలో హెచ్‌ఎం జర్తా సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

జి.మాడుగుల: మండల కేంద్రం జి.మాడుగులలో బుధవారం అంబలం పూజను అయ్యప్ప స్వాములు వేడుకగా నిర్వహించారు. ఈ ప్రాంతం శరణుఘోషతో మార్మోగింది. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక చిత్రకారుడు రమేష్ బృందం అరటి డొప్పలతో అయ్యప్ప, గణేష్, కుమారస్వామి తదితర ఆలయాల నమూనాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అంబలం పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములను సత్కరించారు.

పాత్రికేయులకు అండగా ఉంటాం

- అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: అరకు పార్లమెంట్ పరిధిలో పని చేస్తున్న పాత్రికేయ మిత్రులకు అండగా ఉంటామని అరకు ఎంపీ మాధవి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు.



ఎలాంటి ఇబ్బంది వచ్చినా తగువిధంగా సాయం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయడంలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు.

కలిసి సాగుతూ..

ఏజెన్సీలోని గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు, జీవన వ్యవహార శైలి చాలా భిన్నంగా ఉంటాయి. గిరిజన గ్రామాల్లో అందరూ ఓ కుటుంబంలా కలిసిమెలిసి ఉంటారు. ఏ అవసరమొచ్చినా ఒకరికొకరు సాయం చేసుకుంటారు. వ్యవసాయ పనులు నుంచి కష్టసుఖాల వరకు పంచుకుంటారు. వ్యవసాయ పనుల్లో మాత్రం ఇప్పటికీ పూర్వం అచారాలనే గిరిజనులు పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కుటుంబంలా కలిసిమెలసి..
- కష్ట సుఖాలు పంచుకుంటూ..
- ఒకరి కొకరు సాయం
- వ్యవసాయ పనుల్లోనూ పరస్పర సహకారం
- గిరిజనుల విభిన్న శైలి



వరిపనలను కట్టలను మోసుకొని తీసుకువెళ్తున్న గిరి యువతులు



అడ్డుమండ ప్రాంతంలో ధాన్యం నూర్పునకు సహకారం అందిస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు : పంట భూముల్లో దుక్కి పనుల నుంచి పంట పండి, కోత కోసే వరకు వ్యవసాయ పనులను గ్రామాల్లో గిరిజనులంతా ఉమ్మడిగానే చేపడుతుంటారు. ఒకరికొకరి సాయం అన్ని పనుల్లోనూ ఉంటుంది. వారి ఆచార ప్రకారమే ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ పనులను అన్ని గ్రామాల్లో గిరిజనులు ఉమ్మడి సాయంతో చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 50,723 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేపట్టారు. ప్రకృతి అన్ని విధాలా సహకరించడంతో వరి పైరు కోత దశకు చేరుకుంది. దీంతో వరికోతలు ఊపందుకున్నాయి. నీ..నా అనే భేదం లేకుండా గిరిజనులంతా తమ సొంత పనిలా భాగస్వాములయ్యారు. ఒకరి పంట కోతకు ఒకరు సాయం అందిస్తూ తమ ఆచార సంప్రదాయాలను పాటిస్తున్నారు.

తగ్గిన పెట్టుబడి

ఏజెన్సీలో గిరిజనులు వ్యవసాయ పనుల్లో పరస్పర సాయంతో ఖరీఫ్ వ్యవసాయ పనులకు పెట్టుబడులు తగ్గుతున్నాయి. వరినాట్లు, పలు దఫాలుగా కలుపుతీత, పంట పండిన తరువాత వరికోతలు, వరిపనలు కట్టలు కట్టి సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు ఒకరి కొకరు సాయం చేసుకుంటారు. ధాన్యం నూర్పుల సమయంలోను శ్రమిస్తారు.. నూర్పులు అయిన తరువాత ధాన్యాన్ని ఇంటికి చేర్చేవరకు పరస్పర సాయానికి మన్యంలో ఎంతో ఆదరణ ఉంది. సాయం చేసేందుకు వచ్చేవారికి పంట యజమాని మధ్యాహ్నం భోజనం, మూడుసార్లు టీ సమకూర్చుతారు. సాధారణంగా కూలీలను పెట్టుకుని వ్యవసాయ పనులన్నీ చేయాలంటే ఎకరాకు కనీసం రూ.20వేలుఖర్చవుతుంది. ఒకరికొకరు సాయం చేసుకోవడం వల్ల రూ.5 వేలు సరిపోతుతందని గిరిజనులు తెలిపారు.

ఒకరికొకరు సాయం చేసుకుంటాం



వ్యవసాయ పనుల్లో మగవారి కంటే తామే ఎక్కువ కష్టపడుతుంటాం. అయితే తమ గ్రామంలోని అన్ని కుటుంబాలు వ్యవసాయ పనుల సమయంలో ఒకరికొకరు సాయం చేసుకుంటాం. మాపొలాల్లో వరినాట్లకు తోటి మహిళలు సాయం చేసేందుకు వస్తారు. వారి వరినాట్ల పనులకు మా కుటుంబ సభ్యులు వెళ్తుంటాం. ధాన్యం కోతలు, కట్టల మోతలోను సాయం చేసుకుంటాం.

– పాంగి కాసులమ్మ, గిరిజన మహిళా రైతు, కామయ్యపేట, హుకుంపేట మండలం

బాల్య వివాహాలతో అనర్థాలు

- ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తు పీడీ సూర్యలక్ష్మి

కొయ్యూరు: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి అన్నారు.బుధవారం ఆమె రాజేంద్రపాలెంలో గర్భిణులు, బాలింతలు, బాలికలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలను ఆమె వివరించారు. బాల్యవివాహాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్ సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. సీడీపీవో విజయకుమారి, 'సూపర్‌వైజర్లు లలిత, బాలామణి, సునీత, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి అనుమానాస్పద మృతి

- సమగ్ర విచారణకు కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశం
- నేడు పాడేరులో విద్యాసంస్థల బంద్
- విద్యార్థి సంఘాల పిలుపు



లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాలలో విచారణ జరుపుతున్న గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు



గిరిజన విద్యార్థి పాంగి నవీన్ మృతదేహం

సాక్షి,పాడేరు: స్థానిక లోచలిపుట్టు నంబర్–1గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి పాంగి నవీన్(12) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానిక వెంకటరమణ థియేటర్, లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాల ప్రహరీల మధ్యలో విద్యార్థి మృతదేహం బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. వెంటనే స్థానికులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐ లక్ష్మణ్ సంఘటన ప్రాంతానికి చేరుకుని విచారించారు. విద్యార్థి మృతదేహంపై అక్కడకక్కడ గాయాలను పోలీసులు గుర్తించారు. లోచలిపుట్టు పాఠశాలలో 7వతరగతి చదువుతున్నట్టుగా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇలావుండగా ఎవ్వరికీ చెప్పకుండా ఈనెల 11న వెళ్లిపోయాడని ఆశ్రమపాఠశాల సిబ్బంది చెబుతున్నారు. జి.మాడుగుల మండలంలోని గెమ్మెలి పంచాయతీలోని తల్లిదండ్రులకు కుమారుడు మృతి సమాచారం తెలియజేశారు.నవీన్‌ను ఎవరైనా కొట్టి చంపారా..లేక సినిమాకు వెళ్లే క్రమంలో గోడ దూకుతూ గాయాలపాలై మృతిచెందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

విచారణకు ఆదేశం : లోచలిపుట్టు పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి నవీన్ మృతిచెందిన సంఘటనపై కలెక్టర్ సుమిత్‌కుమార్,ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ విచారం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని వారు పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజని బుధవారం రాత్రి లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాలకు చేరుకున్నారు. హెచ్‌ఎం ప్రసాద్,డిప్యూటీ వార్డెన్, సిబ్బంది, విద్యార్థులను విచారించారు. గిరిజన విద్యార్థి మృతిపై ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ,గిరిజన విద్యార్థి సంఘాల నేతలు గురువారం పాడేరు మండలంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఆయా విద్యార్థి సంఘాల నేతలు ప్రభుదాస్, ఆనంద్, సుమన్ లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. నవీన్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

చెరపల్లిలో ఆధ్యాత్మిక సందడి



హాజరైన భక్తులు



పూజలు చేస్తున్న రాజేష్ నాథ్ అఘోరాస్వామి

భారీగా తరలివచ్చిన భక్తులు

చింతపల్లిరూరల్: మండలంలోని చెరపల్లిలో బుధవారం ప్రగతి భారతం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠం ఉత్తరాధికారి రాజేష్‌నాథ్ అఘోరా స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన భాద్యత మన అందరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పిల్లలకు చిన్నప్పటినుంచి దైవ భక్తిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దైవభక్తికి అధిక ప్రాధాన్యమిచ్చేవారన్నారు. గిరిజనులు హిందూ ధర్మ పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కొన్ని శక్తులు హిందూ దేవాలయాలపై దాడులు చేసి మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయన్నారు.అటువంటి కుట్ర లను మనమంతా కలిసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గోపూజ, శివుని అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, ఆర్ ఎస్ఎస్ ప్రతినిధి గెమ్మెలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి నృసింహ దీక్షలు

- దీక్షధారులకు సింహగిరిపై మాలధారణ
- ఏటేటా దీక్షల తేదీలు మార్పుపై అభ్యంతరం



సమావేశంలో పాల్గొన్న ఏఈవో ఆనంద్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: శ్రీ నృసింహ దీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని సింహాచలం దేవస్థానం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ప్రకటించారు. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మండపంలో బుధవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన నృసింహ దీక్షాధారులతో ఏఈవో, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది దీక్ష తేదీలను అధికారికంగా ప్రకటించారు. ఈనెల 25వ తేదీ నుంచి 40 రోజుల మండల దీక్ష ప్రారంభమవుతుందని, ఆ రోజు సింహగిరిపై వైదికులు దీక్షధారులకు మాలధారణ చేస్తారన్నారు. దీక్షాధారులందరికీ దేవస్థానం తరపున ఉచితంగా తులసిమాలలు అందజేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో దీక్షలు ముగుస్తాయని తెలిపారు. ఆ రోజు దీక్ష విరమణ, స్వామి శాంతి కల్యాణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని వెల్లడించారు. 40 రోజుల పాటు దీక్షాధారులందరికీ స్వామి దర్శనం ఉచితంగా కల్పిస్తామన్నారు. ఏడాది పొడవునా భక్తులు ఎప్పుడైనా నృసింహ దీక్షలు తీసుకోవచ్చని, వారికి ఉత్సవాల రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో స్వామి వారి దర్శనం ఉచితంగా కల్పిస్తామన్నారు.

దీక్షల తేదీలు మారిస్తే ఎలా.?

ఏటేటా దీక్షల తేదీలు మారుస్తుండటం పట్ల సమావేశంలో దీక్షధారులంతా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గతంలో భోగి పర్వదినం రోజు తామంతా దీక్ష ముగించే వారమని, ధనుర్మాసంతో శ్రీనృసింహ దీక్ష ముడిపడి ఉందన్నారు. కానీ దేవస్థానం తీసుకుంటున్న నిర్ణయాలతో ఏటేటా దీక్షల తేదీలు మారుతున్నాయన్నారు. కొండదిగువ కాకుండా సింహగిరిపైనే దీక్ష విరమణ కార్యక్రమం, శాంతి కల్యాణం నిర్వహించాలని డిమాండ్ చేశారు. గడిచిన రెండేళ్లుగా కొండ దిగువనే దీక్ష విరమణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తం



పీహెచ్‌సీలో వైద్య బృందంతో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్రహ్మణ్యం

సాక్షి, పాడేరు: గిరిజన గ్రామాలలో లెప్రసి(కుష్టు) వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఏడీఎంహెచ్‌వో జిల్లా కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం వైద్య బృందాలను ఆదేశించారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, మినుములూరు ఆరోగ్య కేంద్రం, ఇరడాపల్లి సబ్‌సెంటర్లను ఆయన బుధవారం సందర్శించారు. వైద్య బృందాలతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వచ్చే నెల 5వ తేదీ వరకు ఇంటింటా లెప్రసీ వ్యాధి గుర్తింపు, ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. శరీరంపై ఏ రకమైన మచ్చలు లేక నరాలుకు సంబంధించిన అంగవైకల్యం కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యున్ని సంప్రదించాలనే నినాదంతో గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు.

దట్టంగా పొగమంచు



ముంచంగిపుట్టులో మంచులో కట్టెలు మోసుకెళ్తున్న కూలీలు

ముంచంగిపుట్టు: మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారీ పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలవుతోంది. ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత ఉంటోంది. ఉపశమనం పొందేందుకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. బుధవారం ఉదయం 9గంటల వరకు మంచు తెరలు అలుముకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సూర్యోదయం ఆలస్యమవుతోంది. మంచు, చలిలోనే మత్స్యగెడ్డలో నాటు పడవలపై చేపలవేట సాగిస్తున్నారు.

తీరంలో ఆదివాసీ సంబరం

- అలరించిన సంప్రదాయ నృత్యాలు
- ఆకట్టుకుంటున్న కళాకృతులు



సీతంపేట సవర థింసా నృత్యం



పార్వతీపురం గిరిజనుల సంప్రదాయ నృత్యం



అరకు థింసా నృత్యం



కె.ఆర్.పురం కొమ్ము కోయ నృత్యం




సవర పాట పాడుతున్న సీతంపేట గిరిజనులు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో సాగరతీరం పులకించింది. గిరిజన స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుంటూ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆర్కేబీచ్‌లో గిరిజన గౌరవ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా బుధవారం విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా బీచ్‌లో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పార్వతీపురం గిరిజనుల కందికోతల నృత్యం, సీతంపేట గిరిజనుల సవర థింసా, శ్రీశైలం గిరిజనుల చెంచు డ్యాన్స్, పాడేరు గిరిజనుల థింసా, కె.ఆర్.పురం గిరిజనుల కొమ్ముకోయ డ్యాన్స్, మానాదికి చెందిన కీలుగుర్రం డ్యాన్స్‌లు సందర్శకులు, పర్యాటకులను విశేషంగా అలరించాయి. వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు.

ఆకర్షించిన కళాకృతులు : గిరిజనల సంప్రదాయ కళాకృతులు, ఆహార పంటలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోని 25 స్టాళ్లు సందర్శకులను ఆకర్షించాయి. ముఖ్యంగా వెదురు పసుపు, తాటి ఆకులు, గిరిజన ఆహార పదార్థాలు, కాఫీ, తేనే, సేంద్రియ ఉత్పత్తులు, జ్యూట్ బ్యాగులు, జీసీసీ ఉత్పత్తులు, గిరిజన సంప్రదాయ, సంస్కృతులతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది.


జెండాకొండకు పర్యాటకుల తాకిడి



వలిసె పూల తోటల్లో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

హుకుంపేట: పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన సీతమ్మపర్వతం (జెండాకొండా) అందాలు తిలకించేందుకు గురువారం పర్యటకులు భారీగా తరలివచ్చారు. పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలు, సూర్యోదయం తదితర ప్రకృతి అందాలను తిలకించారు. కొండపైనే గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. గొడుగురాయి, హుండీ, గుడ్డిగుమ్మి జలపాతాల్లో స్నానాలు చేస్తూ సందడి చేశారు. వలిసె పూల అందాలను తిలకించారు. అరకు–పాడేరు ప్రధాన రహదారి రంగశీల, పెదగరువు, నందివలస గ్రామాల్లోని వలిసె తోటల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని ప్రకృతి అందాలను భద్రపరచుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన చందుకి చికిత్స చేస్తున్న వైద్యుడు భాస్కర్

అడ్డతీగల : అడ్డతీగల శివారున టేకు ప్లాంటేషన్ వద్ద మలుపులో బుధవారం బొలేరో వాహనాన్ని మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో గంగవరం మండలం ఏటిపల్లికి చెందిన మోటార్ సైక్లిస్ట్ గడుతూరి చందు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. డీటీహెచ్ సర్వీసెస్ మెకానిక్‌గా పనిచేస్తున్న చందు తన తండ్రి చిరంజీవిబాబుతో కలసి స్వగ్రామం ఏటిపల్లి నుంచి మోటార్ సైకిల్‌పై అడ్డతీగల వస్తుండగా అడ్డతీగల నుంచి రంపచోడవరం వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలో చందు తీవ్రంగా గాయపడగా అతని తండ్రి చిరంజీవిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన గడుతూరి చందుని 108 వాహనంలో ఎల్లవరం పీహెచ్‌సీకి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయిలో మెరిసి...రాష్ట్రస్థాయికి ఎదిగి...


రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీకి ఎంపికైన కుసుమ


యల్లపు నీరజ

- క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులు

కోటవురట్ల : మట్టిలో మాణిక్యాలు మెరుస్తున్నాయి. తమలోని ప్రతిభాపాటవాలను అత్యుత్తమంగా ప్రదర్శించి బడికి, ఆ ఊరికి కీర్తిని తీసుకొస్తున్నారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కన్నూరు కుసుమ జిల్లా స్థాయిలో బాలికల అండర్ 17 విభాగం త్రోబాల్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేష్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో కుసుమ విజయం సాధించింది. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం శకుంతల తదితరులు కుసుమకు అభినందనలు తెలిపారు.

యలమంచిలి : జంపపాలెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని యల్లపు నీరజ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి బుధవారం తెలిపారు. అనకాపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో యలమంచిలి మండలం జంపపాలెం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని యల్లపు నీరజ త్రోబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపికైందని తెలిపారు.

కాఫీ సాగు..లాభాలు బాగు

- పక్వానికి వచ్చిన కాఫీ
- అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

చింతపల్లి/గూడెంకొత్తవీధి: మన్యంలో గిరిజన రైతులు ప్రధాన వాణిజ్య పంటగా కాఫీని సాగు చేస్తున్నారు. ఏజెన్సీ కాఫీకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో విస్తారంగా పండిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్షా10వేల ఎకరాల్లో పంట పండిస్తున్నారు. సుమారు 60 వేల గిరిజన కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పక్వానికి వచ్చింది. అధికారులు, కాఫీ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ పంట పండిస్తున్నారు. ఇందులో భాగంగా జీకే వీధిలో ఉన్న ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ కాఫీ రైతులకు శాస్త్రీయ పద్ధతిలో సాగు చేసుకోవాల్సిన అంశాలపై అందించిన పలు సూచనలివీ...

- రైతులు సేకరించిన పండ్లను నాణ్యమైన పప్పుగా తమారు చేయడం ద్వారా మార్కెట్‌లో మంచి ధరలు పొందవచ్చు. కొద్ది పాటి చర్యలు తీసుకుంటే కాఫీలో నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవచ్చు.
- పక్వానికి వచ్చిన పండ్లను ఎప్పటికప్పుడు సేకరించాలి.
- పప్పు తయారీకి సమముగా పండిన కాయలను మాత్రమే ఎంచుకోవాలి. ఎక్కువగా పండినా పచ్చిగా ఉన్నా పప్పు తయారీకి వినియోగించ కూడదు. అలా చేస్తే నాణ్యత దెబ్బతింటుంది. అటువంటి కాయలతో చెర్రీ తయారు చేయాలి.


యంత్రంతో కాఫీ పల్పింగ్ చేస్తున్న గిరిజనులు


పల్పింగ్ ఇలా..

ఏ రోజు కోసిన పండ్లను ఆరోజే పల్పింగ్ చేయాలి. ఎక్కువ రోజులు పండ్లను రాశులుగా పోసి ఉంచకూడదు. పల్పింగ్ తరువాత కాఫీ గింజల్లోని తొక్కలను పూర్తిగా తొలగించి, తొట్టిలో పోసి 24 గంటలు మగ్గబెట్టాలి. తరువాత మంచి నీటితో రెండు సార్లు బాగా కడగాలి. నాణ్యత, రంగు, రుచి పెంచేందుకు నీటిలో రెండు గంటలు నాన బెట్టాలి. తరువాత గింజలను జల్లెడలో పోసి తేమ పోయే వరకూ ఎండబెట్టాలి. తరువాత సిమెంట్ కల్లాల్లో 4 అంగుశాల మందంలో సమానంగా పరిచి ఎండ బెట్టాలి. గంటకోసారి గింజలను బాగా కలియబెట్టాలి. సాయంత్రం పాలిథిన్ సంచులతో కప్పి మరుసటి రోజు మంచు పూర్తిగా తొలగి పోయిన తరువాత మళ్లీ ఎండబెట్టాలి. పూర్తిగా ఎండిన తరువాత కాఫీ నాణ్యత మెరుగ్గా ఉంటుంది.

చెర్రి తయారీ విధానం

సేరించిన కాఫీ పండ్లలో పచ్చి కాయలను వేరు చేయాలి. సిమెంట్ కల్లాల్లో ఎండబెట్టాలి. 3 అంగుశాల మందములో ఎండబెట్టి గంటకోసారి కలియ బెట్టాలి. సాయంత్రం పాలిథిన్ సంచులు కప్పి ఉదయం మంచు తొలగిపోయాక ఎండబెట్టాలి. వాతావరణ పరిస్థితులను బట్టి పూర్తిగా ఎండేందుకు 20-25 రోజులు పడుతుంది. ఎండిన కాఫీ కాయలను చేతితో పట్టుకుని కదిలించినప్పుడు గలగల మని శబ్దం వచ్చినప్పుడే పూర్తిగా ఎండినట్లు గుర్తించాలి. తరువాత మంచి సంచుల్లో నింపి బాగా గాలి, వెలుతురు వచ్చే గిడ్డంగులలో నిల్వచేయాలి. సంచుల కింద చెక్క పీటలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. కాఫీ నిల్వ చేసిన గదుల్లో ఎరువులు, క్రిమి సంహారక మందులు, సుగంధ ద్రవ్య పంటలను ఉంచ కూడదు.

నాణ్యతతో మంచి ధరలు



గిరిజనులు నాటు పద్ధతుల్లో కాకుండా శాస్త్రీయ విధానంలో కాఫీని తయారు చేసుకోవాలి. ఇలా చేసిన పప్పుకు మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతాయి. పల్పింగ్ యంత్రాలను ఐటీడీఏ రాయితీపై పంపిణీ చేస్తుంది. అవకాశాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శివకుమార్, ప్రధాన శాస్త్రవేత్త , ఉద్యాన పరిశోధన స్థానం, చింతపల్లి

రక్తదానం ప్రాణదానంతో సమానం

చింతపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో మొత్తం 21 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ రమేష్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన చేస్తున్న విద్యార్థులు

పశుసంవర్ధక శాఖ ఏడీపై విచారణ


స్థానికుల నుండి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేడి వెంకటస్వామి

అరకులోయ రూరల్: పశుసంవర్ధక శాఖ ఏడీ అశ్వత్థామపై వచ్చిన ఆరోపణల మేరకు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటస్వామి విచారణ చేపట్టారు. పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకొని అక్రమ లాడ్జి కలిగి ఉన్నట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతోపాటు పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ ప్రైవేట్ లాడ్జికి కట్టబెటట్టడమే కాకుండా ఖాళీగా ఉన్న భవనాల్లో కలప దుంగల నిల్వకు వినియోగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పశుసంవర్ధకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ వెంకటస్వామి, సూపరింటెండెంటధర్మన్నపడాల్ బుధవారం విచారణ నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాంతీయ కార్యలయాన్ని పరిశీలించారు. బాత్‌రూంలో ధాన్యం బస్తాల నిల్వను గుర్తించారు. ఏడీకి చెందిన లాడ్జిలో కార్యాలయానికి చెందిన ఫర్నిచర్‌ను గుర్తించారు. వాటిని తరలిస్తుండా స్థానికుల సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ వెంకటస్వామి మాట్లాడుతూ ఏడీపై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ చేపట్టామన్నారు. ఫిర్యాదులో అంశాలు వాస్తవంగానే ఉన్నాయన్నారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. తదుపరి ఆదేశాలమేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పశుసంవర్ధకశాఖ వైద్యులు గణేష్, సాంబమూర్తి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీలు భీమరాజు, సత్రుగున్, రాంచందర్, నర్సింగ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొయ్యూరు : మంప పంచాయతీ కించవానిపాలేనికి చెందిన వి. అచ్చిరాజు గృహం బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. ఇంటిలో ఉంచిన వస్తువులు తీసుకువచ్చేందుకు అవకాశం లేకపోయింది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయామని బాధితుడు అచ్చిరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తమను ఆదుకోవాలని కోరాడు.

రిక్షా కార్మికుడి మృతి

అనకాపల్లిటౌన్: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రిక్షా కార్మికుడు ఎరుకునాయుడు మృతి చెందినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో అంజయ్యకాలనీకి చెందిన సదరు వ్యక్తి రెండురోజుల క్రితం కాలుజారి పడడంతో కుటుంబసభ్యులు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో మాధురి ప్రతిభ


కశింకోట: కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన 9వ తరగతి విద్యార్థులు జ్యోతి స్వరూప్, బి.మాధురి రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీల్లో ప్రతిభ చూపి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా ఈదరలో ఈ పోటీలు జరిగాయి. వీటిలో చూపిన ప్రతిభకు స్వరూప్, మాధురిలను స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, పీఈటీ సీహెచ్‌ఎల్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి

రావికమతం: మండలంలోని శివారు గిరిజన గ్రామం రొచ్చుపణుకులో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన గిరిజన రైతు కట్టెల బాలరాజు(55) బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని కుమారుడు సన్యాసి కథనం మేరకు జీడితోటలో పేరుకు పోయిన గడ్డి, ఇతర పిచ్చి తుప్పల తొలగింపునకు రోటోవీటర్ కమ్ ట్రాక్టర్‌తో దుక్కు దున్నిస్తుండగా బుధవారం సాయంత్రం ప్రాంతంలో రోటోవీటర్‌లో చిక్కుకున్న గడ్డిని తన తండ్రి తొలగిస్తూ ప్రమాదవశాత్తూ పడిపోగా గంపవానిపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామేలపు దేముడు గమనించకపోవడంతో రోటోవీటర్‌లో చిక్కి తన తండ్రి మృతి చెందాడన్నారు. దీనిపై కొత్తకోట పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశానన్నారు.

వెయ్యి లీటర్ల పులుపు ధ్వంసం

రావికమతం: కుముందానిపేట గ్రామ శివార్లలోని పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యిలీటర్ల పులుపును ధ్వంసం చేశామని కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశామన్నారు.


పులుపు ధ్వంసం చేసిన ఎస్‌ఐ, సిబ్బంది

స్కూటీ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

రావికమతం : స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరు గిరిజనులు బుధవారం తీవ్రంగా గాయపడ్డారు. ములకలాపల్లి గ్రామానికి చెందిన బొండా జోగేష్, మజ్జి నాగేశ్వరరావు, రోలుగుంట మండలం గైరంపేటలో ఒక కార్యక్రమంలో పాల్గొని స్కూటీపై వస్తుండగా చీమలపాడు గ్రామ సమీపంలో స్కూటీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108లో నర్సీపట్నం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



గాయాలపాలైన జోగేష్, నాగేశ్వరరావు

తాగునీటి ట్యాప్‌ల మాయంపై ఫిర్యాదు

మునగపాక : గంటవానిపాలెం గ్రామంలోని దళితవాడలో తాగునీటి ట్యాప్‌లను కోన అప్పలరాజు అనే వ్యక్తి తొలగించారని స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాప్‌ల తొలగింపు కారణంగా నీటికి ఇబ్బందులు పడుతున్నామని, అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్‌ఐ చల్లా భీమరాజు తెలిపారు.

100 మంది చిన్నారులకు సదరం ధ్రువీకరణ పత్రాలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం బుద్ధిమాంద్యం గలవారి కోసం సదరం క్యాంపు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 400 మంది చిన్నారులు హాజరయ్యారు. డీఎంహెచ్‌వో హేమంత్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి 100 మందికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ క్యాంపును గురువారం కూడా నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ధ్రువీకరణపత్రాలు నమోదు చేస్తున్న వైద్యాలయ సిబ్బంది

పెట్రోలు బంక్‌ల నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అరకు మండలం పానిరంగిణి ముంచంగిపుట్టు మండలం లుంగపుట్టు, అనంతగిరి మండలం అనంతగిరిలో ఏర్పాటుచేస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంకుల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వయసు 21 ఏళ్లు నిండిన స్థానిక గిరిజన యువకులు, గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హెచ్‌పీ బంక్‌ల సర్వీస్ ప్రొవైడర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో స్థానిక గిరిజనులు అయివుండి, కనీసం టెన్త్ ఉత్తీర్ణ, ఏదైనా వ్యాపార రంగంలో అనుభవం కలిగిన యువత దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థికి రెండేళ్లపాటు ఐటీడీఏతో ఒప్పందం ఉంటుందన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులు పూర్తిగా బంక్‌ల నిర్వహణకు పెట్టుబడి పెట్టుకునే ఆర్థిక స్థోమత కలిగి ఉండాలన్నారు. ముందుగా పాడేరు ఐటీడీఏకు కనీసం రూ.20 లక్షలు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వవలసి ఉంటుందన్నారు. బంక్‌ల నిర్వహణకు ఎంపికైన అభ్యర్థులు స్థానిక గిరిజన యువతీయువకులను నియమించుకోవాలని ఆయన తెలిపారు. సిబ్బందికి జీతాలు ఐటీడీఏ చెల్లిస్తుందని, సర్వీస్ ప్రొవైడర్లకు మాత్రం నెలకు రూ. 30 వేల వేతనం చెల్లిస్తామన్నారు. అంతేకాకుండా జరిగిన వ్యాపారాన్ని బట్టి ఇన్సెంటివ్ ఉంటుందన్నారు. ఒక అభ్యర్థికి ఒక్క పెట్రోలు బంక్ మాత్రమే కేటాయిస్తామని పేర్కొన్నారు. పైన తెలిపిన అర్హతలు కలిగి, ఆర్థిక ఒప్పందానికి అంగీకరించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పీవో సూచించారు. ఈనెల 18నుంచి పాడేరు ఐటీడీఏలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు పొందాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 22 సాయంత్రం 5గంటల లోపు ఐటీడీఏలో అందజేయాలని పీవో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు


సత్యదీక్ష మాలదారులకు ఇరుముడులు సమర్పిస్తున్న తణుకు వెంకటరామయ్య

అడ్డతీగల: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని కొలుస్తూ చేపట్టిన సత్యదీక్షదారుల ఇరుముడుల స్వీకరణ బుధవారం స్థానిక పవనగిరి క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి పవనగిరి క్షేత్రంలోని రుషిపీఠం కళ్యాణ మండపంలో దీక్షాదారులకు ఇరుముడులను క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు స్వీకరింపజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 450 మంది ఇరుముడులు స్వీకరించారు. అనంతరం వీరవెంకట సత్యనారాయణస్వామి వారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. ఇరుముడులు స్వీకరించిన సత్యదీక్షాదారులు గ్రామోత్సవం నిర్వహించారు. సాయి సన్నిధి కల్యాణ మండపంలో అన్నదానం ఏర్పాటుచేశారు. అనంతరం సత్యదీక్షాదారులు అన్నవరం దేవస్థానానికి బయలుదేరి వెళ్లారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాదిలో అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్టు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం సాయంత్రం తనిఖీ చేసి వడ్డాదిలో సర్వే నంబర్ 67లో ఉంచిన 18 యూనిట్లు ఇసుక కుప్పలను సీజ్ చేశామన్నారు. ట్రాక్టర్ల ద్వారా బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్, అదనపు ఎస్‌ఐ నాయుడు పాల్గొన్నారు.


వడ్డాదిలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక